ప్రజాశక్తి
శుక్రవారం 23 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం

టెక్కలి వైసిపి ఇన్‌ఛార్జిగా తిలక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పేరాడ తిలక్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. దువ్వాడ కుటుంబ వివాదం పార్టీకి చెడ్డ పేరు రావడంతో, ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై వేటు వేసింది. దువ్వాడను సార్వత్రిక ఎన్నికల ముందు ఇన్‌ఛార్జిగా నియమించడంతో పాటు టెక్కలి అసెంబ్లీ సీటు కేటాయించింది. టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి దువ్వాడ కుటుంబం, తిలక్ మధ్య తిరుగుతోంది. 2015 నుంచి 2020 వరకు ఇన్‌ఛార్జిగా పేరాడ తిలక్ ఉన్నారు. 2020 జూలైలో మళ్లీ దువ్వాడ శ్రీనివాస్‌కు అప్పగించారు. 2023 ఫిబ్రవరిలో దువ్వాడ సతీమణి వాణికి ఇచ్చారు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరిలో మళ్లీ శ్రీనివాస్‌కు అప్పగించగా, తాజాగా ఆయన్ను తప్పించి తిలక్‌కు అప్పగించారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) అమలు, తీరుతెన్నులపై నేడు జిల్లావ్యాప్తంగా 912 పంచాయతీల్లోనూ గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకనుగుణంగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. చట్టం అమలైన నాటి నుంచి నేటివరకు చేపట్టిన పనులు, కల్పించిన పని దినాలతో తదితర అంశాలతో గ్రామాల వారీగా అధికారులు ఇప్పటికే నివేదికలను సిద్ధం చేశారు. వాటిని గ్రామాల్లో చదివి వినిపించనున్నారు. వీటితోపాటు ఉపాధి హామీ చట్టం లక్ష్యాలు, కూలీలు హక్కుల, వారికి కల్పిస్తున్న సౌకర్యాలు వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

హక్కులు అమలయ్యేనా..?

- అంతంతమాత్రంగా అమలవుతున్న ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ
- కూలీలకు అనేక సౌకర్యాలను తీసేసిన కేంద్రం
- ఉపాధి హామీపై నేడు 912చోట్ల గ్రామసభలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 4.3 లక్షల మందికి జాబ్‌కార్డులను జారీ చేశారు. వీటిలో 3.79 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. జారీ చేసిన జాబ్‌కార్డుల్లో 7.36 లక్షల మంది సభ్యులు ఉండగా, 6.03 లక్షల మంది కూలీలు క్రమం తప్పకుండా పనులకు వస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,03,000 మందికి పనులు కల్పించారు. వీటిలో 3.79 లక్షల కుటుంబాలు ఉపాధి పొందాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,56,54,000 పనిదినాలను కల్పించారు. కూలీలకు పనులు కల్పించడం ద్వారా రూ.224 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ నిధులు సమకూరాయి. ఇందులో సచివాలయాలు, రోడ్లు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు రూ.40 కోట్లను వెచ్చించారు. జిల్లాలో ప్రతి ఏటా రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు మెటీరియల్ కాంపొనెంట్ రూపంలో నిధులు సమకూరుతున్నాయి.

వీటితో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వంటి ఆస్తుల సృష్టికి దోహదపడుతున్నాయి. ఇది కేవలం కూలీలకు పనులు కల్పించడం ద్వారానే వీలు పడుతోంది.



కూలీలకు మాత్రం చట్టంలో పేర్కొన్న నిబంధనల్లో అత్యధిక అంశాలు అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రకరకాల నిబంధనలు, సాంకేతిక అంశాల పేరుతో వారికున్న సౌకర్యాలను తీసేసింది.

నీరు, నీడ కట్

ప్రతిఏటా వేసవి సీజన్‌లో ఉపాధి భృతి చెల్లించేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో చెరో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనంగా భృతి చెల్లించేవారు. నగదు రూపంలో కాకుండా అదనంగా ఆ మేరకు పని శాతం పెంచి కూలీ తగ్గకుండా కొలతలు సర్దుబాటు చేసే పరిస్థితి ఉండగా, కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి రద్దు చేసింది. కూలీలకు తాగునీటి సౌకర్యాన్ని ఆపేసింది. ఉపాధి పనులకు వచ్చే కూలీలకు లీటరుకు రూపాయి చొప్పున ఐదు లీటర్ల వరకు కూలీతో పాటు చెల్లించే వారు. రెండేళ్లుగా దాన్నీ ఆపేసింది. వేసవి కాలంలో మండుటెండల నుంచి ఉపశమనం పొందేందుకు గతంలో టెంట్లు చేసే పరిస్థితి ఉండగా వాటినీ ఆపేశారు. దీంతో కూలీలు సొంతంగా పందిళ్లు వేసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

అమలు అంతంతమాత్రమే

ఉపాధి హామీ చట్టంలో కూలీల కోసం అనేక హక్కులు కల్పించినా, వాటిలో అత్యధిక అంశాలు నేటికీ అమలు కాని పరిస్థితి నెలకొంది. పని కోరిన 15 రోజుల్లో పని ఇవ్వకపోతే ప్రభుత్వం భృతి చెల్లించాల్సి ఉన్నా, ఆ నిబంధననూ ఏనాడు అమలు చేయలేదు. పని ప్రదేశం నివాస ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉంటే రోజు కూలికి అదనంగా పది శాతం అదనంగా ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. కూలి డబ్బులు సకాలంలో చెల్లించకపోతే పరిహారం కలిపి ఇవ్వాలి. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స పెట్టె, తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పని ప్రదేశంలో కూలీ మరణించినా, పూర్తిగా అంగవైకల్యానికి గురైనా రూ.50 వేలు ఇవ్వాల్సి ఉన్నా ఆ డబ్బులనూ ఇస్తున్న పరిస్థితి లేదు.

గ్రామసభల నిర్వహణకు పోలీసు బందోబస్తు

గ్రామసభల నిర్వహణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో సభలు నిర్వహించడం ఇదే మొదటిసారి. గ్రామాల్లో గెలుపోటములు, కక్షలు ఉంటాయన్న అంచనాలతో అధికారులు ఇప్పటికే కొన్ని గ్రామాలను గుర్తించినట్లు తెలిసింది. ఇటీవల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో చాలాచోట్ల గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కొన్ని ముఖ్యమైన గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఉచిత ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు

- అంగూరులో బుకింగ్ పాయింట్
- రవాణా వాహనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం వచ్చే నెల 11 తేదీ నుంచి కొత్త ఇసుక విధానం అమలు చేయనున్న నేపథ్యంలో జిల్లాలో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందజేతకు అన్నిరకాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొత్తూరు మండలం అంగూరులోని ఇసుక స్టాకు యార్డు నుంచి ఉచితంగా అందించేందుకు సోమరాజుపురం సచివాలయంలో బుకింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుకింగ్ కేంద్రంలో ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ప్రతి స్లాట్‌లో రెండేసి గంటలకు సమయం కేటాయించి రోజుకు 15 నుంచి 20 వాహనాల వరకు ఇసుక లోడింగ్‌కు అనుమతి ఇస్తామని చెప్పారు. బుకింగ్ కేంద్రం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే పనిచేస్తుందన్నారు. రాత్రివేళల్లో ఇసుక రవాణా నిషేధించామని స్పష్టం చేశారు. బుకింగ్ కోసం ట్రక్కుల్లోకి ఇసుకను లోడ్ చేసే తేదీ, సమయం పేర్కొంటూ బుకింగ్ రశీదును జారీ చేస్తామని చెప్పారు. ఇసుక రవాణాకు సంబంధించి ఛార్జీలను ఖరారు చేశామని తెలిపారు. లోడింగ్, ఇతర ఖర్చులు కలుపుకొని టన్ను ఇసుకకు రూ.340 ధర నిర్ణయించినట్లు చెప్పారు. టన్ను ఇసుక రవాణాకు సున్నా నుంచి పది కిలోమీటర్ల వరకు రూ.1633, 15 కి.మీ పరిధి లోపు రూ.2035, 20 కిలోమీటర్ల పరిధి లోపు రూ.2,435 తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 35 కిలోమీటర్ల పరిధి లోపు రూ.3,216 చొప్పున ధరను నిర్ధారించినట్లు వివరించారు. ఇసుక నాణ్యంగా లేకున్నా, అదనంగా రవాణా ఛార్జీలు వసూలు చేసినా తమకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఇసుకపై ఫిర్యాదులకు 18004256012 టోల్ ఫ్రీ నంబరు, 9701691657 వాట్సాప్ నంబరు ద్వారా సందేహాలు, ఫిర్యాదులు తెలియజేయొచ్చని చెప్పారు. ఇసుక సరఫరా అయిన 24 గంటల తర్వాత రవాణా ఛార్జీలు, ఇతర సమస్యలేవైనా ఉన్నాయా అంటూ వినియోగదారునికి సిబ్బంది ఫోన్ చేసి తెలుసుకుంటారని చెప్పారు.

ఇసుక రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా ఆర్‌టిఎ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని, రిజిస్ట్రేషన్ లేని వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి రవాణాదారులు ఎలాంటి ఉల్లంఘనలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ యార్డు వద్ద ఎటువంటి వాహనం అనవసరంగా వేచి ఉండకుండా చూస్తామని చెప్పారు. ఇసుక కార్యకలాపాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పర్యవేక్షించేందుకు స్టాక్‌యార్డులకు సమీపంలో రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల ఉద్యోగులతో కూడిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు పాయింట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడం కోసం పైడిభీమవరంలో నిరంతరాయంగా పనిచేసేలాగా చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని వివరించారు. సమావేశంలో గనులు, భూగర్భశాఖ ఉప సంచాలకులు సత్యనారాయణ ఉన్నారు.

మృతుడు రాజశేఖర్ (ఫైల్)

ఉద్యోగంలో చేరిన...

నెల రోజులకే నూరేళ్లు నిండాయి

- అచ్యుతాపురం ఘటనలో జిల్లావాసి మృతి
- వంజంగిలో విషాదఛాయలు

బిటెక్ పూర్తి చేసిన ఆ యువకుడు ఫార్మా కంపెనీలో కెమికల్ ఇంజినీర్‌గా కొలువు సాధించాడు. కాయకష్టం చేసి ఇన్నాళ్లూ తనను చదివించిన తల్లిదండ్రులను పోషించుకునేందుకు ఉద్యోగం లభించిందని సంబరపడ్డాడు. కొడుకు చేతికంది రావడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అయితే ఆ ఆనందం నెల రోజులకే తీరని శోకమైంది. ఉద్యోగంలో చేరిన నెల రోజులకే ఆ యువకునికి నూరేళ్లు నిండడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి - ఆమదాలవలస

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం సంభవించిన రియాక్టర్ పేలుడు ఘటనలో మండలంలోని వంజంగికి చెందిన పైడి రాజశేఖర్ (23) మృతి చెందాడు. గ్రామానికి చెందిన పైడి ధర్మారావు, తులసమ్మ దంపతులు వారికున్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ ఆపై కూలి పనులు చేసుకుంటూ వచ్చిన ఆదాయంతో కుమారుడు రాజశేఖర్‌ను బిటెక్ చదివించారు. కుమార్తెకు వివాహం కూడా చేశారు. రాజశేఖర్ ఉద్యోగ వేటలో కొంతకాలం ప్రయత్నం చేశాడు. ఈ ఏడాది జూలై 15న ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ఉద్యోగం పొంది తల్లిదండ్రులు, గ్రామస్తులతో తన ఆనందాన్ని పంచుకున్నాడు. నాలుగు రోజుల కిందట సెలవుపై గ్రామానికి వచ్చి తాను చేస్తున్న ఉద్యోగ విషయాలను అందరితో చర్చించి ఆనందంతో తిరిగి విధుల్లోకి చేరాడు. ఇంతలోగానే ఫార్మా కంపెనీలో పేలుడు ఘటనలో రాజశేఖర్ మృతి చెందాడన్న వార్త కుటుంబసభ్యులు, గ్రామస్తుల్లో విషాదాన్ని నింపింది.

కుమారుని మరణ వార్తను విన్న వెంటనే తల్లిదండ్రులు సొమ్మసిల్లారు. చేతికందివచ్చిన కొడుకు అవసాన దశలో ఆదుకుంటాడనుకుంటే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడని గుండెలు బాదుకుని విలపించిన తీరు అక్కడున్న వారికీ కంటతడి పెట్టించింది. గ్రామంలో ఎటువంటి వివాదాల్లేకుండా సౌమ్యునిగా గుర్తింపు పొందిన రాజశేఖర్ మృతి చెందిన విషయాన్ని స్నేహితులు, గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. రాజశేఖర్ మృతదేహానికి విశాఖపట్నంలో గురువారం పోస్టుమార్టం అనంతరం గ్రామానికి తీసుకొస్తామని మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు తెలిపారు.

సుభద్రాపురం యువకునికి గాయాలు

లావేరు : ఎసెన్షియా ఫార్మా కంపెనీలో పేలుడు ఘటనలో మండలంలోని తాళ్లవలస పంచాయతీ సుభద్రాపురానికి చెందిన కొండూరు రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. రాంబాబు కొంతకాలంగా ఆ పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాంబాబు విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఎమ్మెల్యే పరామర్శ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబును ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు గురువారం పరామర్శించారు. రాంబాబుతో మాట్లాడి ప్రమాద ఘటన విషయాలను తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట నాయకులు ముప్పిడి సురేష్, ఇజ్జాడ శ్రీనివాసరావు, మురళీమోహన్, గొర్లె శ్రీనివాసరావు తదితరులున్నారు.



రాంబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com / epaper.prajasakti.com

కొత్త వంగడాల ఆవిష్కరణకు పరిశోధనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

రైతులకు అధిక దిగుబడులు వచ్చేలా కొత్త వంగడాల ఆవిష్కరణలకు పరిశోధనలు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. మండలంలోని రాగోలులో గల వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని గురువారం పరిశీలించి, అక్కడ చేపడుతున్న పరిశోధనలపై శాస్త్రవేత్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు చెప్పిన సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి, ఆర్థికంగా బలోపేతం కావాలని రైతులకు సూచించారు. జిల్లాలోని నేలలు ఉద్యాన పంటలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లా రైతులు వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటలు వేసుకుంటే అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కొత్త తోటల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందని తెలిపారు. రైతులు తమకు కావాల్సిన మొక్కల కోసం సంబంధిత ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న శంకర్

28న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28న ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నదీజలాల కాలుష్యంతో దుష్ప్రభావాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాగావళి నదీజలాలు కాలుష్యం బారిన పడడంతో ప్రజలకు తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతున్నాయని సెంచూరియన్ యూనివర్శిటీకి చెందిన పిహెచ్‌డి విద్యార్థి రేగేటి రవికిరణ్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం గణగళ్లవానిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నీటి ద్వారా వచ్చే శిలీంధ్ర వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదిలో మైకోటాక్సిన్ ఉత్పత్తి చేసే శిలీంద్రాల వల్ల కలిగే తీవ్రమైన ప్రమాదాల గురించి జిల్లా ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నాగావళి నదిలోకి శుద్ధి చేయని వ్యవసాయ, ఆక్వాకల్చర్ వ్యర్థ జలాలను విడుదల చేయడం వల్ల తీవ్ర నీటి కాలుష్యం ఏర్పడుతోందని చెప్పారు. దీనివల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు.

హిందీ పండిత కళాశాలలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

2024-25 విద్యా సంవత్సరం ఎల్‌పి సెట్ భాషా పండిత ప్రవేశ పరీక్షను నిర్వహించి హిందీ పండిత శిక్షణా ప్రవేశాలు నిర్వహించాలని హిందీ ప్రచారసభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, ఎపి హిందీ ప్రచార సభ అధ్యక్షులు సి.ఎల్ నాయుడు, ప్రచార సంచాలకులు కోనె శ్రీధర్ కోరారు. రాష్ట్రంలోని హిందీ పండిత శిక్షణ కళాశాల నిర్వహణకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి విన్నవించారు. హిందీ ప్రచారసభ హైదరాబాద్ 1935లో స్థాపించబడిందని, స్వాతంత్రోద్యమంలో హిందీ భాష ద్వారా దక్షిణ భారతదేశం ప్రజలను ఏకం చేయడంలో కీలకపాత్ర పోషించిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం 2021లో ఎల్‌పి సెట్‌ను నిర్వహించి ఫలితాలను విడుదల చేసినా, కళాశాలకు కౌన్సెలింగ్ నిర్వహించలేదన్నారు. 2024-25 ఎల్‌పి సెట్ ఇప్పటివరకు విడుదల చేయలేదని,మోడల్ స్కూల్స్‌లో ఒక్క పిజిటి హిందీ పోస్టు లేదని, 90 శాతం వెల్ఫేర్ స్కూల్స్‌లో పి.జి.టి హిందీ పోస్టులు లేవన్నారు. రాష్ట్రంలో చాలావరకు ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో హిందీ అధ్యాపకులు లేరన్నారు. రాబోయే డిఎస్‌సిలో మిగతా సబ్జెక్టులతో సమానంగా హిందీ ఉపాధ్యాయ నియామకాలు, పిజిటి, టిజిటి, హిందీ, జెఎల్, డి.ఎల్, హిందీ ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఆధారంగా గుర్తించి ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. హిందీ పండిత శిక్షణ కళాశాలను పునరుద్ధరణ, హిందీ ఉపాధ్యాయ నియామకాల భర్తీ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని కేంద్రమంత్రి హామీనిచ్చారు.

వినతిపత్రం అందజేస్తున్న హిందీ ప్రచారసభ హైదరాబాద్ ప్రతినిధులు

శరవేగంగా స్టేడియం నిర్మాణ పనులు

ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాకే తలమానికంగా నిలిచే కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని స్టేడియం నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అత్యాధునిక హంగులతో స్టేడియం నిర్మాణ పనులను చేపడుతున్నామని చెప్పారు. కొద్ది నెలల్లోనే పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వల్ల పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని చెప్పారు. రెండేళ్ల కిందట ఇదే స్థలంలో సభ పెట్టి స్టేడియంకు నిధులు ఇస్తున్నట్లు నమూనా చెక్కును విడుదల చేసినా, పనులు మాత్రం ప్రారంభించలేదన్నారు. ఐదేళ్ల పాటు కాలయాపన వల్ల పనులు సాగకపోగా క్రీడాకారులు అవస్థలు పడ్డారని చెప్పారు. ప్రస్తుతం తిరిగి పనులు ప్రారంభించామని, త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. స్టేడియం డిజైన్‌లో ఎలాంటి మార్పు ఉండదని, ఆరు గేట్లతో గ్యాలరీ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, ఇఇ రవి, డిఎస్‌డిఒ శ్రీధర్, కాంట్రాక్టరు, టిడిపి నాయకులు రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అన్నిరకాల పనులు చేర్చాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో వ్యవసాయ అనుబంధ పనుల జాబితాలోకి అన్నిరకాల చెరువు పనులు చేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ, వ్యవసాయ అనుబంధ పనుల వివరాలను తెలియజేయడానికి రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గ్రామసభల నిర్వహణను స్వాగతించారు.

మాట్లాడుతున్న వ్య.కా.స నాయకులు

జిల్లావ్యాప్తంగా 6.03 లక్షల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారని చెప్పారు. వీరందరికీ వంద రోజులు పని కల్పించాలంటే జిల్లాలో ఉన్న అన్నిరకాల చెరువుల్లో పనులు చేయడానికి అవకాశం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలకు కేటాయించిన పనుల జాబితాలో చేర్చాలని చెప్పారు. గ్రామాల్లో శ్మశానవాటికలకు రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ప్రభుత్వం కేటాయించిన ఇళ్లస్థలాలు ఉన్న చోట పనులు పెట్టాలని సూచించారు. మెటీరియల్ కోసం ఖర్చు పెట్టే నిధులు 90 శాతం మట్టి పనులకు కేటాయించాలని, కూలీలకు కనీస కూలి, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధి హామీ సైట్ సూపర్‌వైజర్లకు పారితోషికం, సెల్‌ఫోన్ ఇవ్వాలని, ఉపాధి హామీ యంత్రాంగంపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే అశోక్‌ను అభినందిస్తున్న న్యాయవాదులు

ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర ప్రభుత్వం లాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసినందుకు ఎమ్మెల్యే బెందాలం అశోక్‌కు ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలిసి అభినందనలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.రమణయ్య రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి పలు సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా బాహుదా రోడ్డు వంతెన కూలిపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన మీదగా చిన్న వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, నిత్యం ఇచ్ఛాపురం రావాల్సిన బస్సులు బెల్లుపడ మీదగా రాకపోకలు సాగిస్తున్నారని, ఇదే మార్గంలో భారీ వాహనాలు కూడా రావడం వలన బెల్లుపడ నివాస ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు దక్కత కృష్ణమూర్తి రెడ్డి, సీతయ్య రెడ్డి, ఎస్ఎల్.నారాయణ, సోమశేఖర్ రెడ్డి, దేవరాజు, ఎన్ సి.సాహు, రంగారావు, రాంబాబు, బైరాగి రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి కిరణ్‌కుమార్

బూర్జలో పారిశుధ్య పనులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

బూర్జ: మండల కేంద్రంలోని రెల్లివీధిలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. 'సమస్యల వలయం' శీర్షికన గురువారం ప్రచురితమైన అధికారులు స్పందించారు. కార్యదర్శి బలివాడ కిరణ్ కుమార్ రెల్లివీధిలో పారిశుధ్య పనులను చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను, రోడ్డుపై పారుతున్న మురుగునీరును తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

రేపు చొక్కాకుల బంద రీ సర్వే

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం మండలం చింతాడ వద్ద ఆక్రమణలకు గురైన చొక్కాకుల బంద సరిహద్దులను గుర్తించడానికి ఈనెల 24న రీసర్వే నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ ఎస్. గణపతిరావు తెలిపారు. 'ఆక్రమణలో చొక్కాకుల బంద' శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. సంబంధిత సర్వే నెంబర్‌లో ఆక్రమణలను గర్తించడానికి ఆమదావలస మున్సిపల్ సర్వేయర్, శ్రీకాకుళం సర్వేయర్ బృందం సంయుక్తంగా రీసర్వే చేస్తారని, అనంతరం హద్దులను గుర్తించి ఆక్రమణదారులు ఉన్నట్టయితే జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం ఆర్‌డిఒ ఆదేశాను సారం నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. వాస్తవానికి ఈ బంద ఆమదావలస మున్సిపాలిటీ భూభాగంగా ఉందని, రీసర్వే అనంతరం వారికి అప్పజెప్పడం జరుగుతుందన్నారు. పురపాలక శాఖ నిబంధనలకు లోబడి చర్యలు ఉంటాయన్నారు.

న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

రాజీ మార్గమే రాజ మార్గం

కోటబొమ్మాళి: కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయంతో పాటు వ్యయం ఆదా అవుతుందని రాజీమార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కోర్టులో న్యాయవాద సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జరగబోయే జాతీయ లోకదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులను గుర్తించి ముందస్తుగానే వాటిని కోర్టుకు తెలియజేస్తే వారితో చర్చలు జరిపి రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. అదే విధంగా బుధవారం నుంచి ప్రీ లోక్అదాలత్‌లు నిర్వహిస్తున్నామని, అప్పుడే కేసులపై రాజీ పత్రాలు రాయించి వారితో చర్చలు జరిపి రాజీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ ఎస్.తిరుపతి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు వంచిరెడ్డి అర్జునరావు, వెలమల అప్పల నాయుడు, కె.మన్మధరావు, వై.వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో నర్సింగపల్లి, మెళియాపుట్టిలింగపురం పంచాయతీ పరిధిలో 11 కెవి వార్షిక మరమ్మతులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు తెలిపారు. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పలాస: బొడ్డపాడు సబ్‌స్టేషన్ 11 కెవి ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాకన్నపల్లి, చిన్న నీలావతి, పెద్ద నీలావతి, కొత్త ఊరు, గురుదాస్ పురం, మామిడి మెట్ట, రంగోయి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగాలు సహకరించాలని ఆయన కోరారు.

మందస: మందస, హరిపురం 11 కెవి ఫీడర్లకు ఆనుకొని వున్న చెట్ల కొమ్మలు తొలగించడం తొలగింపులో భాగంగా మందస, హరిపురం టౌన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

పొందూరు: మండలంలోని 11 కెవి దళ్లవలస ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దళ్లవలస, అచ్చిపోలవలస, పెనుబర్తి, పిల్లలవలస, ధర్మపురం, మొదలవలస, బొడ్డేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యావంతులు కావాలి

మందస: ప్రతిఒక్కరూ విద్యావంతులుగా మారాలని ఎంఇఒ లక్ష్మణరావు అన్నారు. గురువారం స్థానిక మండల మహిళా సమైక్య వెలుగు సిఎస్‌లు, సిసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు వయసుతో సంబంధం లేకుండా 19 ఏళ్ల నిండిన వారు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ చదువుకోవచ్చన్నారు. ఓపెన్ స్కూల్‌లో చేరేందుకు ఈ నెల 28 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మందస, హరిపురం ఉన్నత పాఠశాలలో నేరుగా దరఖాస్తులు అందజేసే కోవచ్చునని, ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఎపిఎం ప్రసాదరావు, సిసిలు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా పనులు గుర్తించాలి

సరుబుజ్జిలి : మాట్లాడుతున్న ఎపిడి, ఎంపిడిఒ

ప్రజాశక్తి- పలాస

ప్రతి సచివాలయం పరిధిలో గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించాలని ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులు, ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డు అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయాన్ని స్వర్ణ సచివాలయంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 22 రకాల పనుల్లో భాగంగా ఇప్పటివరకు ఎన్ని పనులు గుర్తించారు, ఇంకా ఎన్ని పనులు చేయాల్సి ఉందో సచివాలయ పరిధిలో గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేయాలన్నారు. ప్రతి సచివాలయం గ్రామసభకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి వైకుంఠరావు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: గ్రామ సభలను ప్రతి గ్రామ పంచాయతీలో సక్రమంగా నిర్వహించాలని ఎపిడి పంచాది రాధ, ఎంపిడిఒ పి.వి.వి.మురళీమోహన్ కుమార్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం ఉద్యోగులకు గ్రామసభలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాలపై నిర్వహిస్తున్న ఈ గ్రామ సభలపై క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ బి.పార్వతి, ఇసి రమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: గ్రామ సభలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపిడిఒ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, 11 గంటల నుంచి 2 గంటల వరకు గ్రామసభలు నిర్వహణ ఉంటుందని ఎంపిడిఒ తెలిపారు.

పోలాకి: గ్రామసభల్లో సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట రమణ ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి, ఏ విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు, పరిశీలనకు ఎవరని నియమించారు తదితర అంశాలను పరిశీంచారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉషశ్రీ, తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్, ఇఒపిఆర్‌డి పద్మావతి, సూపరింటెండెంట్ సూర్య ప్రకాశరావు, హౌసింగ్ ఎఇ శంకరరావు, సీనియర్ అసిస్టెంట్ దేవరాజు, ఎపిఒ రమణారావు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

కంచిలి: గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి, పశుసంవర్థకశాఖ జెడి వి.జయరాజ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామసభల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత శాఖ అధికారులు పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధి పథకం డివిజనల్ విజిలెన్స్ అధికారి లవ రాజు, ఎపిడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఒ నీరజ, ఇఒపిఆర్‌డి రాంబాబు, పశువైద్యాధికారి శిరీష పాల్గొన్నారు.

పోలాకి : సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఇఒ

కోటబొమ్మాళి: గ్రామసభలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ కె.ఫణీంద్రకుమార్, ఎపిఒ జి.హరిప్రసాద్, ఇఒపిఆర్‌డి బి.రామారావు పాల్గొన్నారు.

కవిటి: గ్రామసభలు పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఒ పైల సూర్యనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు పంచాయతీల్లో గ్రామసభలు సజావుగా నిర్వహించేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డిటి రామచంద్రరావు, ఉద్యానవన శాఖ అధికారి పి.మాధవీ లత, ఎంఇఒ ధనుంజయ మజ్జి, జెఇ ప్రవీణ్ కుమార్, హౌసింగ్ ఎఇ సాయికిరణ్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు కీలక శాఖలకు సంబంధించిన అధికారులు రాకుండా ఆ శాఖ దిగువ స్థాయి అధికారులు హాజరయ్యారు. ఇరిగేషన్ శాఖపై సభ్యులు లేవనెత్తే అంశాలపై పూర్తిస్థాయిలో సమాధానం రాలేదు. వైద్య ఆరోగ్యశాఖ తరపున డిజిపురం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుధీర్ మాట్లాడారు. ప్రస్తుతం మండలంలోని నాలుగు పిహెచ్‌సిల్లో ఆరు నెలలకు సరిపడా పాముకాటు, కుక్కకాటు టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పాముకాటుకు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తే ప్రమాదం తప్పదన్నారు. దీనిపై ఆశ, ఎఎన్‌ఎంలతో గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తా మన్నారు. వెలుగు అధికారులు మాట్లాడుతూ పిఎంఇజి పథకం కింద రూ.లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు సబ్సిడీపై రుణాలు మంజూరవు తున్నాయని తెలిపారు. గ్రామస్థాయిలో చిన్న కుటీర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వారు బ్యాంకుల ద్వారా రుణాలు పొందొచ్చన్నారు. రెవిన్యూ శాఖపై జరిగిన చర్చలో తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఓటరు నమోదుకు ఇంటింటా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. గతంలో జరిగిన శాశ్వత భూహక్కు చట్టంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరిస్తామని తెలిపారు. అంగన్వాడీ భవనాలకు స్థలాలు చూపిస్తే నూతన భవనాలు మంజూరు చేస్తున్నట్లు ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో ఎరువులు, డిఎపిలు అందుబాటులో లేవని నిలదీశారు. వ్యవసాయ అధికారి సురేష్ మాట్లాడుతూ మూడు రోజుల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, ఎంపిడిఒ ప్రేమలీల, వైస్ ఎంపిపిలు తులసమ్మ, చింతామణి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వసంత రెడ్డి

ఎస్‌పికి మొక్కను అందజేస్తున్న సిఐ

ఎస్‌పిని కలిసిన సిఐ

పలాస: జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని ఎస్‌పి కార్యాలయంలో కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై సిఐకు దిశా నిర్దేశం చేశారు.

తోటవాడలో పర్యటిస్తున్న వైద్యసిబ్బంది

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- బూర్జ

మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ సూచించారు. గురువారం మండలంలోని టిడిఆర్ పేట, తోటవాడ గ్రామాలను సందర్శించారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోవడం వలన వ్యాధులను అరికట్ట వచ్చన్నారు. స్థానికులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో జ్వరాలు ఉన్నాయా అని పరిశీలించారు. ప్రజలు డెంగీ, మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈమెతో పాటు జోనల్ టీం డిస్టిక్ మలేరియా ఆఫీసర్ పివి సత్యనారాయణ, డిస్టిక్ కన్సల్టెంట్ ఎల్. శ్రీకాంత్, సూర్య, అప్పారావు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు: మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపక గెస్ట్ పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసేవారు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుకేషన్ చేసి 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా కలిగి ఉండాలన్నారు. విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాప కులకు ప్రాధాన్యత ఉంటుందని, ఒకసెట్ నకలు పత్రాలు, ఫోటోలతో కళాశాలలో 24న సాయంత్రం 4 గంటలలోగా అందజేయాలని ఆమె పేర్కొన్నారు.

నందిగాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి గణిత శాస్త్రంలో అతిథి అధ్యాపకునిగా పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టులో 50శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలన్నారు. బయోడేటాను నేరుగా ఈ నెల 23న 4.30 గంటలలోగా జూనియర్ కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

ఆర్‌టిఐ మండల ఉపాధ్యక్షునిగా దేవరాజు

దేవరాజు

కవిటి: ఆర్‌టిఐ మండల ఉపాధ్యక్షుడుగా కపాసుకుద్దికి చెందిన కోడ దేవరాజు నియమించ బడ్డారు. మండలం కపాసుకుద్దికి చెందిన దేవరాజు ఉద్దానం ప్రాంతంలో జరిగే రక్తదాన శిబిరాల్లో పాల్గొంటూ యువతలో రక్తదానంపై అపోహలు తొలగించి, విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. అదే విధంగా మండలంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు స్వచ్ఛంద సంస్థలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ఈ సందర్భంగా దేవరాజుకు పలువురు అభినందనలు తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గత కొన్నేళ్లుగా ఆక్రమణకు గురైన ఆంధ్రాబ్యాంకు రోడ్డును మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆంధ్రాబ్యాంకు రోడ్డులోని కొంత స్థలం గత కొన్నేళ్లుగా ఆక్రమణకు గురైందని ఇటీవల కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించి యుద్ధ ప్రాతిపదికన రూ.5 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణకు గురైన రోడ్లపై ప్రత్యేక దృష్టిపెట్టి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆంధ్రాబ్యాంక్ రోడ్డు ఆక్రమణల వలన కొంత ప్రాంతం విడిచిపెట్టి రహదారి నిర్మాణం చేపట్టామని, నేడు ఆక్రమణ రహదారి నిర్మాణం కూడా పూర్తిచేసి విశాల వంతమైన రహదారిగా రూపుదిద్దుకోనందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కౌన్సిలర్ పప్పల ప్రసాద్, పలువురు కాంట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

ఆర్‌ఆర్ కాలనీలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజుల కొల్లివలస సమీపంలో ఉన్న వంశధార రిజర్వాయర్ నిర్వాసితుల ఆర్‌ఆర్ కాలనీలో గురువారం రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించారు. వంశధార నిర్వాసితులైన తిరునాగూరు రవి, తిరునాగూరు ప్రమీల అనే ఇద్దరు వ్యక్తులకు ప్రభుత్వం గాజుల కొల్లివలస బ్లాక్ -2లో ఒక్కొక్కరికి ఐదుసెంట్లు స్థలం మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని అదే ఆర్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న బండి విజయ, బండి సింహాచలం ఆక్రమణ చేసి పశువుల రేకుల షెడ్లను వేసి వాడుకుంటున్నారు. వంశధార నిర్వాసితులమైన తమకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని వేరే వ్యక్తుల ఆక్రమణలో ఉన్నాయని వారి నుంచి స్థలాలను ఇప్పించాలని బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ ఎస్.రాంబాబు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ముందుగా ఆక్రమణదారులతో అధికారులు మాట్లాడినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో జెసిబి సహాయంతో అధికారులు ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జెసిబి సహాయంతో తొలగిస్తున్న ఆక్రమణలు

అవగాహన కల్పిస్తున్న సురేష్ కుమార్

లెప్రసీ కేసులపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొత్త లెప్రసీ కేసులు నమోదవుతున్నందున వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ఇంటింటా సర్వే చేపట్టాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్రైట్ ఫ్యూచర్స్ డెవలప్‌మెంటు సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన గురువారం నిర్వహించిన పునశ్చరణ శిక్షణలో ఆయన మాట్లాడారు. సామాజిక సిగ్గు (సోషల్ స్టిగ్మా) వల్ల ఇప్పటికీ చాలామంది లెప్రసీ సర్వేకు సహకరించడం లేదన్నారు. చాలా కేసులు నేరుగా రిమ్స్ ఆసుపత్రికి వెళుతున్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎల్‌సిడిసి సర్వే అనంతరం పిహెచ్‌సిల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త కేసులు నమోదు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేడ్ -2 డిఫార్మిటీ కేసులకు సంబంధించి ఎవరైనా అనాథలు ఉంటే నరసన్నపేటలోని బ్రైట్ ఫ్యూచర్స్ సంస్థకు పంపించాలన్నారు. సదస్సులో వైద్యాధికారి డాక్టర్ లిల్లి, బ్రైట్ ఫ్యూచర్స్ సంస్థ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

108 సిబ్బంది అవగాహన

నందిగాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంలు, పిహెచ్‌సి హెచ్‌ఒలకు మండలం పరిధిలో గర్భిణులు, నవజాత శిశువు కేసులపై 108 సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నందిగామ మెడికల్ ఆఫీసర్ కె.అనిత కుమారి, 108 సిబ్బంది ఇఎంటి రాము, పైలట్ చిరంజీవి ఉన్నారు.

ప్రధాన రహదారిపై వరద

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక నివగాం రహదారిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో వున్న ప్రధాన రహదారిపై హడ్డుబంగి గెడ్డ సాగునీటి కాలువలో పూడిక పేరుకుపోవడంతో వరదనీరు రహదారిపై ప్రవహిస్తుండడంతో పాటు ఆస్పత్రి ప్రాంగణంలోకి నీరు చొచ్చుకు పోవడంతో పాదచారులు, వాహనదారులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరద నీరుతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సాగునీటి కాలువలో పేరుకుపోయిన పూడికను వేసవిలో అధికారులు తొలగించి వుంటే ఈ సమస్యకు ఉండేది కాదని స్థానికులు విమర్శిస్తున్నారు. అలాగే పాన్‌షాప్‌లు హోటళ్లు, కిరాణా దుకాణదారులు, పండ్లు వ్యాపారులు నేరుగా చెత్తను సాగునీటి కాలువలో పారబోస్తుండడంతో ఈ దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో ఉన్న చెత్త

ఆస్పత్రి జంక్షన్‌లో వరదనీరు

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

8 తులాల బంగారం రికవరీ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును చేదించి వ్యక్తిని అరెస్టు చేసి 8 తులాల బంగారం రికవరీ చేసినట్లు నరసన్నపేట సిఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పోలాకి పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మబగాంకు చెందిన తెలుగు గౌరి ఇంట్లో ఈ నెల 8న దొంగతనం జరిగి 8 తులాల బంగారం అపహరణ జరిగిందని ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేయడం జరిగిందన్నారు. ఆ కేసుపై ఎస్ఐ సత్య నారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్ఐ సత్య నారాయణకు వచ్చిన సమాచారం మేరకు గురువారం ఉదయం నరసన్నపేట మండలం సత్యవరం కూడలి వద్ద సర్వీస్ రహదారిలో ఎక్స్ఎల్ బండిపై వెళ్తున్న నాగళ్ల నాగరాజును ముద్దాయిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాగరాజు శ్రీకాకుళం రూరల్ మండలం కరిమిల్లి పేటకు చెందిన వ్యక్తి అని తెలిపారు. ముద్దాయి నుంచి 8 తులాల బంగారం రికవరీ చేసి అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టినట్టు తెలిపారు. ఈ కేసు విచారణలో ఎస్ఐతో పాటు పోలీసులు కె.జగన్నాథం, వెంకట రమణ, చిన్నారావు, శంకరరావు పాల్గొన్నారు. వారిని సిఐ అభినందించారు.

కమిషనర్‌గా బాలాజీ ప్రసాద్

ప్రజాశక్తి- ఆమదాలవలస

బాలాజీ ప్రసాద్

రాష్ట్ర ప్రభుత్వం చేసిన బదిలీల్లో భాగంగా పూజారి బాలాజీ ప్రసాద్‌ను ఆమదాల వలస మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఇప్పటివరకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బాలాజీ ప్రసాద్ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. గతంలో ఆమదాల వలస మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

మాట్లాడుతున్న కుమార్ నాయక్

ముత్యంకు జన జాగృతి నివాళి

ప్రజాశక్తి- పలాస

జన జాగృతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్షతన గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ విప్లవోద్యమ రచయిత, బహు గ్రంథకర్త, సామాజిక విమర్శకుడు, డాక్టర్.ముత్యంకు జన జాగృతి సమాఖ్య ఘన నివాళ్లర్పించింది. సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి తన కవిత ద్వారా డాక్టర్ ముత్యంకు శ్రీకాకుళం జిల్లాతో గల అనుబంధాన్ని సమగ్రంగా తెలియజేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో జాగృతి పరిచే సంస్థలు నిత్యం మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జన జాగృతి అధ్యక్షులు కుమార్ నాయక్, కోశాధికారి బాలకృష్ణ వర్మ, కళాశాల లెక్చరర్ పి.మధు, లైన్స్‌క్లబ్ అధ్యక్షులు హెచ్.వై.దొర, కోశాధికారి ఎన్.అప్పారావు, వెంకట్రావు, కె.పి.రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

26న అన్న క్యాంటీన్లు ప్రారంభం

కోటబొమ్మాళి: ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 26న టెక్కలి ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద, కోటబొమ్మాళి ఎన్‌టిఆర్ భవనంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభం జరుగుతుందని గురువారం అన్న క్యాంటీన్ నిర్వాహకులు లాడి శ్రీనివాస్ తెలిపారు. అలాగే శ్రీకాకుళం జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం గౌరవ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపిపి డోకి మోహనరావు 91వ జన్మదినం సందర్భంగా ఆయన రూ.10 వేల నగదును అన్నక్యాంటీన్ నిర్వాహకులకు అందజేశారు.

పనులు పరిశీలిస్తున్న రాజశేఖరరెడ్డి, ఎస్ఐ రాజేష్

జంగిల్ క్లియరెన్స్

మెళియాపుట్టి: పలాస - పర్లాకిమిడి ప్రధాన రహదారిలో చాపర, మెళియాపుట్టి మధ్య జంగిల్ క్లియరెన్స్ లేకపోవడంతో అనునిత్యం ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు మాజీ మండల టిడిపి అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి గురువారం సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్ తదితరులున్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ

ముగిసిన ఒక్కరోజు శిక్షణ

కవిటి: మండలంలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిఆర్ఎంటిఎస్‌కు గురువారం కవిటిలో ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణ ముగిసింది. ఎంఇఒ ధనుంజయ మజ్జి, డిఆర్‌పి దుదిస్టి రౌలో ఈ శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన పరిశీలన, యాప్‌లో ఏ విధంగా నిక్షిప్తం చేయాలి తదితర అంశాలపై శిక్షణ కల్పించారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కవిటి: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోంపేట ఆరోగ్యవరం సౌజన్యంతో కవిటి మండలం రాజపురం ఆదర్శ పాఠశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సుమారు 460 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరికి పలు సలహాలు, సూచనలు అందించి, అవసరమైన వారికి కళ్లజోడు అందిస్తామని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం మాడెం ఈశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జానపద దినోత్సవం

ప్రజాశక్తి- కవిటి

జానపద దినోత్సవ వేడుకలు కవిటి కొత్తూరు ఆర్య విజ్ఞాన భారతి పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మార్పు అనిల్ మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలు, ప్రాచీన సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన పలు జానపద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శిరీష, సరిత, జ్యోతి, సుహాసిని, రాజేశ్వరి, రూప్నీ, మాదికమ్మ, కృష్ణ కుమార్, అంజలి, లక్ష్మీ జ్యాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి- పలాస

స్థానిక ఎంఆర్‌సికి గురువారం పాఠ్యపుస్తకాలు చేరాయి. 3, 4, 5, 6, 8, 10 తరగతుల సెమిస్టర్ 2కు సంబంధించిన సుమారు 8 వేల పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం తెలిపారు. మరో రెండు రోజుల్లో ప్రతి పాఠశాలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలిపేట శ్మశానవాటిక వద్ద సర్పంచ్ గొండు రమణమూర్తి ఆధ్వర్యంలో నూతన బోరును ఏర్పాటు చేశారు. గురువారం శ్మశాన వాటిక వద్ద నూతన బోరును తవ్వించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మూర్తి మాట్లాడుతూ గ్రామంలో ఎవరు చనిపోయినా దహన సంస్కారాలు నిర్వహించేందుకు మంచినీరు అందుబాటులో లేకపోవడంతో నానా ఇబ్బందులు పడే వాళ్లమని ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని నూతన బోరును తవ్వించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. బిజెపి మండల అధ్యక్షుడు చింతాడ అప్పారావు, గ్రామ కార్యదర్శి బి.పూర్ణిమ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లావేరు: మండలంలోని గుమ్మడాంకు చెందిన గుండు చిన్నమ్మడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకుడు మజ్జి రామ్మూర్తి నాయుడు గురువారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతు సాయంగా కొంత నగదు, రెండు బస్తాల బియ్యాన్ని అందజేశారు. భవిష్యత్‌లో ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముప్పుడి వెంకటేశ్వరరావు, దుర్గారావు, నాగం వెంకటరావు, శెట్టిపల్లి సత్యం, జి.నీలకంఠం, జి.ఆదినారాయణ, సంతోష్, దుర్గారావు, ముఖలింగం తదితరులున్నారు.

నిస్వార్థ సేవకులను గుర్తించాలి

శ్రీకాకుళం అర్బన్: నిస్వార్థ సేవకులను గుర్తించటం అందరి బాధ్యతని పొన్నాడ.రవికుమార్ గురువారం తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో వేడుకలు గురువారం నిర్వహించారు. మనో వికాస కేంద్రంలో వికలాంగ పిల్లలకు నిస్వార్థ సేవలందిస్తున్న సేవకులకు వస్త్రాలు అందించి, సత్కరించారు. ఈకార్యక్రమంలో మానవతా సేవాసంస్థ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్, సెక్రటరీ శ్రీనివాస్,వైస్ చైర్మన్ నటుకుల.మోహన్, సభ్యులు బి.లక్ష్మణ రావు, కన్వీనర్ పార్వతీశంలతో పాటు పలువురు వక్తలు మాట్లాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సమస్త నేటికి 20 వసంతాలు పూర్తి చేసుకుందని, గురువారం ఆవిర్భావదినోత్సవాన్ని బెహరా మనోవికాసకేంద్రంలో జరుపుకోవటం చాలా ఆనందంగా ఉదన్నారు. . బెహరాలో పిల్లలు సుమారు ఎనభై వరకు ఉన్నారని, వారికి కనీసం తినటం గాని, వారి పని వాళ్ళ చేసుకోలేని స్థితిలో ఉన్నారని, అటువంటి వారికి నిస్వార్థంగా సేవలు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మానవతా ట్రెజరర్ సింగూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్తగా ఎదగాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రతి విద్యార్థి ఒక పారిశ్రామికవేత్తగా ఎదిగి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించాలని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్మెంట్ (నిస్బడ్) మాస్టర్ ట్రైనర్ సాయిరాం అన్నారు. స్థానిక ఎల్విఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం, అవగాహన ఎంతో అవసరమన్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు సాధ్యమని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు కోసం చూడకుండా తమ ప్రాంతాలకు అనువైన పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఢిల్లేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, కో-ఆర్డినేటర్స్ పి.మోహనరావు, ఎన్.ప్రభాకరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సాయిరాం

నిత్య కృషీవలుడు చిరంజీవి

శ్రీకాకుళం అర్బన్ : అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న దానేటి శ్రీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పద్మభూషణ్ అవార్డు గ్రహీత సినీ నటుడు నటనతో పాటు సేవా రంగంలో ఎన్నో కార్యక్రమాలతో ప్రజలకు సేవలందిస్తున్నారని, ఆయన అడుగు జాడల్లో అభిమానులు మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని గుజరాతిపేట జంక్షన్ లో చిరంజీవి సీనియర్ అభిమాన సంఘం ఆధ్వర్యాన చిరంజీవి పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిరంజీవి నిత్య కృషీవలుడని, ఎంతో శ్రమతో చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నారన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టి అసాధారణ వ్యక్తిగా ఎదిగిన ఆయన మహోన్నతమైన వ్యక్తిత్వం గలవారన్నారు. దశాబ్దాల పాటు కళామ తల్లికి సేవలందిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారని, మరో వైపు రక్తనిధి కేంద్రాలు, ఐబ్యాంకులను ఏర్పాటు చేసి ప్రజలకు తనవంతు సాయమందిస్తున్నారన్నారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టిడిపి నాయకులు అందవరపు సంతోష్, చిరంజీవి అభిమానుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో మొక్కలు నాటారు. అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిరు అభిమానులు ఆలిమ్ ఖాన్, దాసరి అజయ్, దత్తి శ్రీను, తిప్పిన జనార్ధన రెడ్డి, ఆజ్జు కుమార్, డాక్టర్ దేవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

ఆమదాలవలస: మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని కోల్పోవద్దన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎఎస్ఐ లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ఇచ్ఛాపురం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలం ధర్మపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కొత్త చట్టాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలవలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి

ప్రజాశక్తి- పలాస

వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ ఎఒ పోలారావు అన్నారు. మండలం పూర్ణభద్రలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో సమావేశం నిర్వహించి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంపై అవగాహన కలిగించేందుకు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రైతులు వరిసాగుపై మెళకువలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఇఒ సిహెచ్ శారద, సత్యవతి, స్వాతి, శ్రీనివాస్, రైతులు వరిశ తారకేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో పొత్ర కొండలో పొలంబడి నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ నరసింహమూర్తి, సిబ్బంది కుమారి, కె.ఉష, బి.విశ్వనాథం, పి.సోమేష్, షణ్ముకరావు, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సూదికొండ కాలనీలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సి 1071, ఎస్టి 640, బిసి 1152, మైనార్టీ 118 సంక్షేమ హాస్టళ్లలో సుమారుగా ఆరు లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వం 5 నుంచి 10 వరకు నెలకు రూ.1400, ఇంటర్, డిగ్రీ, పిజీ విద్యార్థులకు రూ.1600 మెస్ చార్జీలు ఇస్తున్నారన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ఏళ్ల తరబడిగా సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను ప్రభుత్వాలు పెంచడం లేదన్నారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వాచ్‌మేన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు అర్జున్, సందీప్, శివాజీ, పవన్, ప్రవీణ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం -ఆమదాలవలస రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కాంట్రాక్టర్కు సూచించారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలసకు నిర్మాణం అవుతున్న రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వల్ల అనేకమంది తమ ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కనీస అవసరాలను కూడా వైసిపి ప్రభుత్వం తీర్చలేకపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. కొద్ది నెలల్లోనే నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పాతపట్నం: ఇటీవల వెస్ట్ బెంగాల్లో అతి దారుణంగా హింసించి అత్యాచారం హత్య చేయబడ్డ జూనియర్ డాక్టర్ మోమిత ఘటనపై పాతపట్నంలో గురువారం ప్రదీప్ యువసేన, ఎస్ఎన్‌డి యూత్ నిరసన వ్యక్తం చేశారు. పాతపట్నం మెయిన్ రోడ్డు సెంటెన్స్ స్కూల్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా యువసేన నాయకులు సవిరిగాన ప్రదీప్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, అదే విధంగా జూనియర్ డాక్టర్ ఘటనలో బాధితులను కఠినమైన శిక్ష విధించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డ నేతాజీ, గోకవలస రాము, ఎస్ఎన్‌డి శివ, దినేష్ రవి, కిరణ్, అభిరామ్, సాయి పాల్గొన్నారు.

మొక్కను అందజేస్తున్న సొండి ప్రతినిధులు

'సొండి'లను ఒబిసిలో చేర్చాలి

శ్రీకాకుళం అర్బన్: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న సొండి సామాజిక తరగతిని ఒబిసిలో చేర్చేందుకు కృషి చేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి మర్చంట్ నేవీ సాహుకారి నాగేశ్వరరావు కోరారు. అమరావతిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అబ్కారీ విధానంలో షాపులు, బార్ కేటాయింపులో 10 శాతం సొండి సామాజిక తరగతికి కేటాయించాలని కోరారు. ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో విశాఖ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సమక్షంలో రత్నాల శ్రీనివాసరావు, రత్నాల జగన్మోహనరావులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో ఆగస్టు 20 నుంచి 2025 జనవరి 25 వరకు నిర్వహించే ఓటరు జాబిత సవరణకు అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు సహకరించాలని స్థానిక తహశీల్దార్ వి.అప్పలరాజు అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ బిఎల్ఒలు ఇంటింటికి వస్తారని కొత్తగా చేర్పులు, మార్పులు ఉంటే సరి చేయించుకోవాలని సూచించారు. నవంబర్ నెలలో 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించటం జరుగుతుందన్నారు. అవసరమైన ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.